## క్లుప్తంగా

### రహదారి మరమ్మతుల పరిశీలన



ఆలమూరులోని దేవి థియేటర్ వద్ద పనులను పరిశీలిస్తున్న నయీముల్లా

**ఆలమూరు:** జొన్నాడ–మండపేట రాష్ట్ర రహదారిలో ఇటీవల జరిగిన మరమ్మతులను ఆదివారం ఆర్అండ్బీ రాష్ట్ర చీఫ్ ఇంజినీర్ నయీముల్లా పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రహదారులకు మరమ్మతులు జరుగుతున్న పనుల్లో భాగంగా స్థానిక ఆలమూరు దేవి థియేటర్ వద్ద ఈ పనుల నాణ్యతను రాష్ట్ర ఇంజినీర్ నయీముల్లా పరిశీలించారు. అలాగే వాహనదారులు, ప్రయాణికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 15 కిలోమీటర్ల మేర చేపట్టిన మరమ్మతుల నాణ్యతా ప్రమాణాలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్ అండ్బీ ఎస్ఈ కాంతు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాము, డిప్యూటీ ఇంజినీర్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

### నిత్యాన్నదానానికి విరాళం



దాత కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ, ఏసీ

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి రాజమహేంద్రవరానికి చెందిన పరిమి వెంకట నాగరత్నం కుటుంబ సభ్యులు ఆదివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. దాతను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది అభినందించారు.

### ఓఎన్జీసీ ప్లాంట్ను సందర్శించిన విద్యార్థులు



నగరం ఓఎన్జీసీని సందర్శించిన విద్యార్థులు

**మామిడికుదురు:** కడలి జెడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఒకేషనల్ కోర్సులో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్ నిమిత్తం నగరంలో ఉన్న ఓఎన్జీసీ ప్లాంట్ను ఆదివారం సందర్శించారు. ఓఎన్జీసీ అధికారిక సిబ్బంది, సాంకేతిక నిపుణల పర్యవేక్షణలో ప్లాంట్లో నిర్వహిస్తున్న అంశాలను విద్యార్థులకు వివరించారు. ఓఎన్జీసీ విధివిధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, నిర్వహణ అంశాలను విపులంగా తెలియజేశారు. అలాగే ఓఎన్జీసీ ప్లాంట్ ద్వారా తీస్తున్న ముడిసరుకు, యంత్రాలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ఎస్ శర్మ, పీఎంసీ చైర్మన్ ప్రకాశరావు, 114 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### కార్యకర్తల కుటుంబాలకు బీమా అందజేత

**మలికిపురం:** ఇటీవల రాజోలు నియోజకవర్గ జనసేన కార్యకర్తలు మలికిపురం మండలం కత్తిమండ గ్రామానికి చెందిన చిట్టాల పద్మనాభం, రాజోలు మండలం కడలి గ్రామానికి చెందిన చిక్కాల రంగారావు ప్రమాదవశాత్తూ మరణించారు. వీరి కుటుంబానికి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ద్వారా వర్తించే ఇన్సూరెన్స్ మొత్తం రూ.5 లక్షల చెక్కులను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు రాజానగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి గెద్దం మహాలక్ష్మీప్రసాద్, రాజోలు వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరాజు, మలికిపురం ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, క్రియా వలంటీర్లు గాలిదేవర సూర్య, ముత్యాల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### సెల్ టవర్ వద్దంటూ నిరసన



సెల్ టవర్ వద్దంటూ నినాదాలు చేస్తున్న స్థానికులు

**రావులపాలెం:** జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ వద్దంటూ రావులపాలెంలోని లైన్ వెంకటరెడ్డి విల్లాస్కు చెందిన కాలనీ వాసులు ఆదివారం ఆందోళన చేశారు. సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సెల్ టవర్ మాకొద్దు అంటూ ఫ్లెక్సీలు కట్టి నిరసన వ్యక్తం చేశారు. అలాగే సమీపంలో వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

# శీతాకాలం నేస్తాలు .. ఉన్ని వస్త్రాలు

- చలికి పెరుగుతున్న డిమాండ్
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

**ఆలమూరు:** వాతావరణంలో సంభవిస్తున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో శీతాకాలంలో కూడా తుపాన్లు సంభవించడంతో గత కొన్ని రోజులుగా ఆకాశం మేఘావృతం కావడంతో పాటు ఉష్ణోగ్రతలు గణనీయమైన స్థాయిలో పడిపోతున్నాయి.

దీని ప్రభావం వల్ల శీతల గాలులు ప్రభావం అధికమై చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. గత ఐదేళ్లలో లేని విధంగా ఈ ఏడాది చలి తీవ్రత తారస్థాయికి చేరుకుంది. రాత్రి సమయంతో పాటు పగటి ఉష్ణోగ్రతలు సైతం తక్కువగా నమోదు కావడంతో చలిగాలులు పెరిగి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

దీంతో గ్రామీణ ప్రాంత ప్రజానీకం రాత్రి సమయాల్లో ఉన్ని వస్త్రాలు ధరించి వెచ్చబడుతున్నారు. అలాగే రాత్రి వేళల్లో వీస్తున్న చల్లగాలులకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, గర్భిణులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధిగ్రస్తులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. శీతాకాలంలో పలు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.



జొన్నాడ జాతీయ రహదారి చెంతనే ఉన్ని దుస్తుల విక్రయాలు



గుమ్మిలేరులో కమ్ముకున్న పొగమంచు

**జోరందుకున్న ఉన్ని వస్త్రాల అమ్మకాలు**

క్లస్టర్ పరిధిలోని రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 11 మండల కేంద్రాలతో పాటు 216, 216ఏ జాతీయ ప్రధాన రహదారుల్లో ఉన్ని వస్త్రాల విక్రయాలు జోరందుకున్నాయి. ఢిల్లీ, రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు వ్యాపారస్తులు వివిధ మండలాల్లో ముఖ్యకూడళ్లలో అనేక దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆకర్షణీయమైన రీతిలో విస్తుగొల్పే వివిధ రంగుల్లో స్వెటర్లు, రగ్గులు, మఫ్లర్లు, శాలువాలు, మంకీ క్యాప్లు, గ్లౌజ్లను సరసరమైన ధరలకే అమ్మకాలు చేపట్టారు. చలి తీవ్రత వల్ల ఉన్ని వస్త్రాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఈ ఉన్ని వస్త్రాలను నేరుగా తయారీ కేంద్రాల నుంచే కొనుగోలు చేసుకుని తీసుకురావడంతో ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో ఉంటున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. గత ఐదేళ్లుగా ఉత్తరాది రాష్ట్రాలను నుంచి వచ్చి స్థానికంగా సాగిస్తున్న వ్యాపారం లాభసాటిగా ఉంటుందని ఉన్ని వస్త్రాల వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది చలి ప్రభావం అధికంగా ఉండటంతో ఉన్ని వస్త్రాల విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**



చలి తీవ్రత మునుపెన్నడూ లేని విధంగా రోజురోజుకూ పెరిగిపోతుంది. చలిని తట్టుకునేందులకు వీలుగా ప్రజలందరూ ఉన్ని దుస్తులు వినియోగించాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలి. వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను అధిగమించాలి.

– డి.సాయికిషోర్, వైద్యాధికారి, పెదపళ్ల పీహెచ్సీ

**ఆశాజనకంగా వస్త్ర విక్రయాలు**



వాతావరణం పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉన్ని వస్త్రాల విక్రయాలు ఆశాజనకంగా ఉన్నాయి. మూడు నెలల సీజన్లో ఇప్పటికే సగం రోజులు గడిచిపోయాయి. విక్రయాలు జరిపేందుకు తీసుకువచ్చిన స్టాకులో అధిక శాతం విక్రయించకున్నాం.

– ఈశ్వర్ రాథోడ్, నాగపూర్, మహారాష్ట్ర

### చలి తీవ్రతతో సంభవించే వ్యాధులు- నివారణ చర్యలు

- చలిగాలుల్లో పెరిగితే ఊపిరితిత్తుల సమస్య, చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- ఈ చలి కాలంలో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే అనేకమైన అనారోగ్య సమస్యల బారినపడే అవకాశం ఉంది.
- సూర్యకిరణాలు ప్రసరించే వరకూ ఉదయాన్నే బయటకు రాకూడదు. అలాగే సాయంకాలం ఆరు దాటిన తరువాత బయటకు వెళ్లకూడదు.
- తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే చెవులకు, ముక్కుకు చలిగాలి తగలకుండా మాస్కులు ధరించాలి.
- శీతల గాలులకు చర్మం పొడిబారి చర్మవ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున వైద్యుల సలహాలు పాటించాలి.
- శరీరం పొడిబారకుండా చర్యలు తీసుకునే క్రమంలో ఎట్టి పరిస్థితుల్లోనూ చలిమంట కాచుకోకూడదు.
- చర్మం పొడిబారకుండా ఉండటానికి నూనె, మాయిశ్చరైజర్లు వంటి క్రీములు వంటివి శరీరానికి రాసుకోవాలి.
- చలికాలంలో తప్పనిసరిగా ఉన్ని దుస్తులు ధరించాలి. ఉన్ని దుస్తుల వల్ల అలర్జీ వచ్చే అవకాశం ఉన్నందున తరచూ ఎండలో ఆరబెట్టాలి.
- శీతాకాలంలో వ్యాయామం కాని వాకింగ్, జాగింగ్ కాని చేసే వారందరూ పలు జాగ్రత్తలు పాటించి వైద్య సలహాలను స్వీకరించాలి.

## పీఎం ఫసల్బీమాపై అవగాహన



సఖినేటిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఏవో నరసింహారావు

**సఖినేటిపల్లి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సదరు సిబ్బందికి, ఉద్యాన శాఖ సిబ్బందికి, పీఏసీఎస్ సిబ్బందికి ప్రధానమంత్రి ఫసల్బీమా యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో మండల ఏవో పీవీ నరసింహారావు మాట్లాడుతూ, వరిలో రబీ పంటకు బీమా రైతు వాటా 25 శాతం ప్రీమియాన్ని ఈనెల 31తేదీ లోగా చెల్లించాలని, ఈ మేరకు ఒక ఎకరాకు పంటకు రూ.630 చెల్లించాలన్నారు. ప్రస్తుత రబీలో వరి సాగుచేస్తున్న రైతులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రంలో ఈ-క్రాప్ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలని ఏవో సూచించారు. రైతులు కామన్ సర్వీసెస్ సెంటర్లోను, పీఏసీఎస్, సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద, నేరుగా ఎన్సీఐపీ వెబ్సైట్లోను, మొబైల్ యాప్ లలో ఏదో ఒక పద్ధతిలో బీమా నమోదు చేసుకోవచ్చన్నారు. కాగా ఆయా పీఏసీఎస్లు, జాతీయ బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు బ్యాంకు ద్వారా ప్రీమియం చెల్లించాలని ఏవో సూచించారు. తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డీటీ సీహెచ్ భాస్కర్ పాల్గొన్నారు. మండలంలోని రామేశ్వరంలో పీఎం ఫసల్బీమా యోజనపై వరి రైతులకు ఏవో పీవీ నరసింహారావు అవగాహన కల్పించారు.

## పంటకాలువలో పశువుల కళేబరాలు



ఇసుకపూడి పంట కాలువలో పశువుల కళేబరాలు, చెత్తాచెదారం

**అంబాజీపేట:** శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందించే పంట కాలువల్లో పశువుల కళేబరాలు దర్శనమివ్వడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చిరతపూడి నుంచి మాచవరం వచ్చే పంట కాలువలో పందులు, కుక్కల కళేబరాలతో పాటు కోళ్ల వ్యర్థాలతో నిండిపోతున్నాయి. కాలువ నిండా చెత్తా చెదారం పేరుకుపోవడంతో ఈ కళేబరాలు ఎక్కడికక్కడ రోజులు తరబడి నిలిచిపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాకుండా ఇళ్లలోని వాడకపు నీరు, సెప్టిక్ ట్యాంకుల నుంచి పైపులను కాలువలోకి వదిలేస్తున్నారు. దీంతో శ్మశానవాటికకు వెళ్లి వచ్చేవారు కాలువలో స్నానం చేయాలంటే ఏ రోగం వస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు పంట కాలువను శుభ్రం చేయడంతో పాటు కాలువలోకి వదులుతున్న వ్యర్థాలను పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని రైతులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాం, కళేబరాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆత్మరక్షణకు తైక్వాండో అవసరం



అంబాజీపేటలో జరిగిన తైక్వాండో గ్రేడ్ టెస్ట్లో పాల్గొన్న క్రీడాకారులు

**అంబాజీపేట:** ఆత్మరక్షణతో పాటు మానసికోల్లాసానికి, ఆరోగ్యానికి, శారీరక దృఢత్వానికి తైక్వాండో ఎంతో అవసరమని హెచ్ఎం కడలి సాయిరామ్, కోకోఫెడ్ కన్వీనర్ అరిగెల బలరామమూర్తి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టు జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి, సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి, బ్లాక్ బెల్ట్ ఎగ్జామినర్ బి.అర్జునరావు మాట్లాడుతూ గ్రేడింగ్ టెస్ట్లో జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు గ్రేడింగ్ టెస్ట్లో పాల్గొన్నారు. అర్జునరావుతో పాటు సీనియర్ కోచ్ కె.సత్యనారాయణల, జి.లక్ష్మినారాయణల పర్యవేక్షణలో గ్రేడ్ టెస్టులు నిర్వహించారు. ఎల్లో, ఎల్లో 1, గ్రీన్, గ్రీన్ 1, బ్లూ, బ్లూ 1, రెడ్ బెల్ట్ గ్రేడింగ్ సంబంధించి 120 మంది బెల్ట్ గ్రేడింగ్ పొందారు. కార్యక్రమంలో బ్లాక్ బెల్ట్ హోల్డర్స్ నేషనల్ రిఫరీస్, కోచ్లు పితాని భార్గవి, పి.నాగభూషణం, పి.మణికంఠ, కె.రమేష్, ఎ.భర్గేష్, ఆర్.సమర్నాథ్లు పాల్గొన్నారు.

## బీసీల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

**అంబాజీపేట:** బీసీల సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయడంతో పాటు బీసీ కులగణన చేపట్టాలని రాష్ట్ర కమిటీ చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు, రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ డిమాండ్ చేశారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న సామాజిక భవనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీసీ సమన్వయ కమిటీ సమావేశం బీసీ నాయకులు దొంగ రామసత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీసీ కులగణనకు రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా సమావేశాలు నిర్వహించామన్నారు. బీసీ మహిళలకు మహిళా బిల్లులో ఉప కోటా కల్పించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోకన్వీనర్ కుర్రా శ్రీనివాసులు, పాలకొల్లు వెంకటరమణ, కాంద్రేగుల నరసింహం, కుసుమ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం సభ విజయవంతం చేయాలి

**రావులపాలెం:** హిందూ దేవాలయాల్లో నిర్వహణ ప్రభుత్వం కాకుండా భక్తుల అభిప్రాయం మేరకు నిర్వహణ జరగాలంటూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించేలా నిర్వహణ చేయాల్సిన సంస్కరణలు తదితర అంశాలపై హైందవ శంఖారావం పేరుతో జనవరి ఐదున విజయవాడలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ గుంటూరు జిల్లా ఇంచార్జ్ తమ నంపూడి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా హిందూ దేవాలయాల్లో చేపట్టవలసిన సంస్కరణలపై జనవరి 5న విజయవాడ దగ్గర కేసరపల్లి గ్రామంలో హైందవ సంఘాల ప్రతినిధులు, స్వామీజీలు కలసి లక్షలాదిగా హిందువులంతా పాల్గొనే ఈ సభకు కొత్తపేట నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా హిందువులు తరలిరావాలని కోరారు. దీనికోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. బస్సుల్లో వచ్చే వారు 949499860, 9849211437 ఈ నంబర్లలో ముందుగా ఆర్ఎస్ఎస్ కొత్తపేట ఖండ ప్రతినిధులు ఐవీ స్వామి, బి.శ్రీనివాసరావులను సంప్రదించాలన్నారు.

## పూర్వ విద్యార్థుల కలయిక

**రాజోలు:** ఇరవై ఐదేళ్ల తర్వాత పదో తరగతి వరకు కలసి చదువుకున్న వారంతా ఒకచోట కలిశారు. బి.సావరం శోభన స్కూల్లో 1999లో పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం నిర్వహించారు. అప్పటి ప్రిన్సిపాల్ జోమ్మి ఆధ్వర్యంలో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు వచ్చారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ ఫాదర్ జోసఫ్ మాట్లాడుతూ 2024 సిల్వర్ జూబ్లీ రీయూనియన్ పేరుతో నిర్వహించిన సమ్మేళనం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. సమ్మేళనం ఏర్పాటుకు కృషి చేసిన పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు.

## కమ్మ మహాజన సంఘం ఉపాధ్యక్షుడిగా పాపారావు



వంటిపల్లి పాపారావు

**ఆలమూరు:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమ్మ మహాజన సంఘం ఉపాధ్యక్షుడిగా ఆలమూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల కాకినాడలోని కంటిపూడి సుబ్బమ్మ కల్యాణ మండపంలో ఆదివారం ఉమ్మడి జిల్లా కమ్మ మహాజన సంఘం సమావేశం జరిగింది. అందులో భాగంగా మూడు జిల్లాలకు చెందిన సహచర సభ్యులు పాపారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి అనేక మంది ఉపాధ్యక్షుడిగా ఎంపికైన పాపారావును పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం



బాధితుడి తండ్రికి చెక్కు అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

**రావులపాలెం:** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.12,500 చెక్కు సాయంగా అందజేశారు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుండేపూడి గ్రామానికి చెందిన వైదాడి నాగబాబు పెయింటింగ్ పని చేసుకుంటున్నారు. పది రోజులు క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. రూ.9 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. అంత ఆర్థికస్తోమత లేక కుటుంబ సభ్యులు కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో నాగబాబు తండ్రి ధర్మరాజుకు సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12,500 చెక్కు అందజేశారు.

### అగ్నికుల క్షత్రియ అధ్యక్షుడిగా రాంబాబు

**అయినవిల్లి:** కోనసీమ అగ్నికుల క్షత్రియ అయినవిల్లి మండలం నూతనంగా కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం ముక్తేశ్వరంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఈ ఎన్నిక జరిగింది. నూతన కార్యవర్గంలో అగ్నికుల అయినవిల్లి మండల సంఘం అధ్యక్షుడిగా కర్రి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నుకోగా అధ్యక్షుడితో పాటు గౌరవ అధ్యక్షుడిగా పోతాబత్తుల ఆంజనేయులు, పంతాడి శ్రీను, ఉపాధ్యక్షుడిగా బొమ్మిడి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కర్రి రాము, మల్లాడి వర్మ, కార్యవర్గ సభ్యులుగా చింతా నాగేశ్వరరావు, కర్రి సతీష్, కర్రి శ్రీను, పి.సుబ్బారావు, మేడా కృష్ణ తదితరులు ఎన్నికయ్యారు. వీరిని అగ్నికుల క్షత్రియ సంఘ పెద్దలు, పలువురు అభినందించారు.

### ఇంటి తాళం పగలగొట్టి చోరీ

**రావులపాలెం:** ఇంటి తాళం పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, వెండి వస్తువులు, నగదు దొంగిలించుకుపోయారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు పై ఆదివారం రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై చంటి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రావులపాడులో నివాసం ఉంటున్న శనగన ధర్మయ్య ఈనెల 25న కుటుంబ సభ్యులతో కలసి గోకవరంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఆదివారం మధ్యాహ్నం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగలగొట్టి బీరువాలోని నాలుగు కాసుల బంగారు వస్తువులు, 20 తులాల వెండి వస్తువులు, రూ.40 వేలు నగదు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయినట్టు గుర్తించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కాకినాడ నుంచి క్లూస్ టీం ను రప్పించి వివరాలు సేకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంటి తెలిపారు.

### అమిత్షాను బర్తరఫ్ చేయాలి

**అయినవిల్లి:** పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని అయినవిల్లి మండల మాల మహానాడు ఆదివారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పార్లమెంట్లో అమిత్ షా మాట్లాడుతూ అంబేడ్కర్ పేరును పదేపదేవచ్చరించడం ఫ్యాషన్ అయిందని ఆయన పేరు కంటే దేవుని స్మరిస్తే స్వర్గలోకి ప్రాప్తి కలుగుతుందని అనడంపై మండల మాల మహానాడు తీవ్రంగా స్పందించింది. ఈవిషయంపై ముక్తేశ్వరం అంబేడ్కర్ కూడలిలో ఆదివారం మండల మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరసనలో మండల మాల మహానాడు అధ్యక్షుడు గిడ్ల వెంకటేశ్వరరావు, బొక్క రామచంద్రరావు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

### కాలువ పూడికతీత పనులు ప్రారంభం



వెదురుమూడి పంట కాలువలోని పూడికతీత పనులు ప్రారంభిస్తున్న నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు

సాక్షి ఇంపాక్ట్

**ఆలమూరు:** మండలంలోని జొన్నాడ-వెదురుమూడి పంట కాలువ పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. ఈనెల 28న 'సాక్షి' దినపత్రికలో 'పెంట కాలువలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు కాలువ పూడికతీత పనులను ఆదివారం ప్రారంభించారు. సాగునీటి సంఘం పరిధిలోని అన్ని పంటకాలువల్లోను పూడిక తీసి సాగునీరు సక్రమంగా పారేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### తాచుపాము, రక్తపింజర్ల హల్చల్



ముక్కామలలో తాచుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ వర్మ

**అంబాజీపేట:** తాచుపాము, రెండు రక్తపింజర్లు హల్చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అంబాజీపేట శివారు రావులమ్మ పానాటం సమీపంలో బొంతు సాయిబాబు వ్యవసాయ క్షేత్రంలో రెండు రక్త పింజర్లు హల్చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురై భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్వర్మకు సమాచారం అందించారు. దాంతో వర్మ రెండు రక్తపింజర్లను పట్టుకుని డబ్బాలో బంధించారు. అలాగే ముక్కామల బీసీ కాలనీలో సగ్గు నాగేశ్వరరావు ఇంటిలో ఉన్న తాచుపామును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించి జన సంచారం లేని ప్రాంతంలో మూడు పాములను వదిలిపెట్టారు.


### ప్రతిభకు పట్టాభిషేకం



అవార్డు స్వీకరిస్తున్న శ్రీసాయి విద్యాధర్

**ఆలమూరు:** గ్రామానికి చెందిన అద్దరి శ్రీసాయి విద్యాధర్కు ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. నంద్యాలలో రాష్ట్ర కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాపు విద్యార్థులకు ఆదివారం ప్రోత్సాహకాలు అందజేశారు. అందులో భాగంగా శ్రీసాయి విద్యాధర్కు ప్రశంసా పత్రం, మెమెంటోతో పాటు రూ.పదివేల నగదు బహుమతిగా నిర్వాహకులు అందజేశారు.

### సత్యసంజీవ్కు టైమ్స్ ఐకాన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సత్య సంజీవ్

**మామిడికుదురు:** ఈదరాడకు చెందిన ప్రముఖ హోమియోపతి వైద్యుడు చిక్కం సత్యసంజీవ్కు టైమ్స్ ఐకాన్స్ ఆఫ్ ది హెల్త్ కేర్ అవార్డును అందుకున్నారు. ప్రముఖ హోమియోపతి వైద్యుడు సత్యసంజీవ్ హోమియోపతిలో చేస్తున్న అత్యున్నత సేవలను పురస్కరించుకుని విజయవాడలో టైమ్స్ ఐకాన్స్ ఆఫ్ ది హెల్త్ కేర్ 2024 అవార్డు లభించింది. ఈ అవార్డును మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డును అందుకున్న సత్యసంజీవ్ను పలువురు వైద్యులు, స్థానికులు అభినందించారు.

### పిచ్చికుక్క దాడి: ఐదుగురికి తీవ్ర గాయాలు

**అంబాజీపేట:** పిచ్చికుక్క స్వైర విహారం చేసి దాడి చేసిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇసుకపూడిలో ఓ పిచ్చికుక్క చింతా వాసు, పళ్ల స్వామి నాయుడుతో పాటు మరో ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. దాంతో క్షతగాత్రులను అమలాపురం ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.